
సాక్షి
నిర్మల్
మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



కుప్టి..ప్రాణాలు హరీ
నేరడిగొండ–ఇచ్చోడ మండలాల మధ్య కుప్టి బ్రిడ్జి వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. 8లో▸



రైతు ఆత్మహత్యాయత్నం
పోలీసుల వేధిస్తున్నారని ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామానికి చెందిన రైతు పురుగుల మందు తాగాడు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
39.5 /26.4

వాతావరణం
ఆకాశంలో అక్కడక్కడా మేఘాలు ఉంటాయి. రోజంతా ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ప్రతీ పౌరుడికి పోలీస్ రక్షణ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: జిల్లాలో ప్రతీ పౌరుడికి పోలీస్ రక్షణ ఉంటుందని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ ఠాణాల ఎస్సైలతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల సహాయం కోసం నేరుగా ఠాణాకు రావాలని ప్రజలకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, అసాంఘిక చర్యలు జరుగుతున్నట్లు తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వార్షిక పరీక్షల ప్రశ్నపత్రాల కొరత తీర్చాలి



రాజేశ్‌నాయక్

ఖానాపూర్: ఈ నెల 12 నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాల కొరత తీవ్రంగా ఉందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజేశ్‌నాయక్ తెలిపారు. డీసీఈబీ నుంచి వార్షిక పరీక్షలకు సరిపడా ప్రశ్నపత్రాలు పంపించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు డీసీఈబీ నుంచే ప్రశ్నపత్రాలు రావాల్సి ఉండగా, ఈఏడు దాదాపు సగం పాఠశాలలకు సరఫరా కాలేదని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల కోసం ఉపాధ్యాయులు ఎంఆర్‌సీలకు వచ్చి తిరిగి వెళ్తున్నారని తెలిపారు. రెండు రోజుల్లో పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో వెంటనే సరిపడా ప్రశ్నపత్రాలు పంపించాలని కోరారు.

సైన్స్ పరీక్షకు తొమ్మిది మంది గైర్హాజరు

నిర్మల్ రూరల్: జిల్లాలో సోమవారం జరిగిన పదో తరగతి సైన్స్ పరీక్షకు తొమ్మిది మంది గైర్హాజర్ అయినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 9,088 మంది విద్యార్థులకు 9,079 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. రెగ్యులర్ కేటగిరీలో 9,078 మంది విద్యార్థులకు 9,070 మంది పరీక్ష రాయగా 8 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ కేటగిరీలో పది మంది విద్యార్థులకు తొమ్మిది మందే హాజరయ్యారు. ఒకరు గైర్హాజరైనట్లు డీఈవో తెలిపారు.

కడెం ఆయకట్టుకు చివరి తడి

కడెం: కడెం ప్రాజెక్ట్ ఎడమ కాలువ ఆయకట్టుకు మంగళవారం నుంచి చివరి తడిగా నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ తెలిపారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 681.700 అడుగుల నీరు ఉందని పేర్కొన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. యాసంగి పంటలకు వారబందీ పద్ధతిన ఇప్పటి వరకు ఆరు తడులు ఇచ్చామని తెలిపారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ.2.10 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

దిలావర్‌పూర్: మండలంలోని ప్రాచీన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయం కోసం వేలం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో త్వరలో నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, వేలం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మల చిన్నయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏడాదిపాటు కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయ హక్కులను రూ.2.10 లక్షలకు సత్యనారాయణ దక్కించుకున్నాడు. ఈమేరకు ఆలయానికి ఆదాయం సమకూరింది. ఆలయ కార్యవర్గ సభ్యుడు కిషన్, దేవాదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, జూనియర్ అసిస్టెంట్ మాధవరావు పాటిల్, శివకేశవులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆమె ఆరోగ్యానికి భరోసా



పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

- సత్ఫలితాలిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమం
- ఉమెన్ క్లినిక్‌లలో ప్రతీ మంగళవారం ఆరోగ్య పరీక్షలు
- జిల్లాలోని రెండు పీహెచ్‌సీలలో పెరిగిన మహిళల ఓపీ
- స్థానికంగానే 8 రకాల వ్యాధులకు స్క్రీనింగ్
- నాలుగు వారాల్లో 712 మందికి వైద్య పరీక్షలు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మహిళల నుంచి ఆదరణ లభిస్తోంది. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 100 ఆరోగ్య కేంద్రాల్లో ఉమెన్ క్లినిక్ కార్యక్రమం ప్రారంభించారు. జిల్లాలో బంగల్‌పేట్ అర్బన్ ఆరోగ్య కేంద్రం, భైంసాలోని అర్బన్ పీహెచ్‌సీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. వీటిలో ప్రతీ మంగళవారం మహిళలకు మాత్రమే ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నారు. మహిళల్లో 8 రకాల వ్యాధులకు సంబంధించిన 58 రకాల పరీక్షలు చేసేందుకు టీ–హబ్‌కు శాంపిల్స్ పంపిస్తున్నారు. రిపోర్టుల ద్వారా చికిత్స, మందులు అందిస్తున్నారు. ఖరీదైన వైద్య పరీక్షలు కూడా ఉచితంగా అందుబాటులో ఉండడంతో అనారోగ్య సమస్యలు ఉన్న మహిళలు ఉమెన్ క్లినిక్‌కు రావడానికి ఆసక్తి చూపుతున్నారు.

స్క్రీనింగ్ వివరాలు:

పరీక్షలు	భైంసా యూపీహెచ్‌సీ	బంగల్‌పేట్ యూపీహెచ్‌సీ
రిజిస్ట్రేషన్లు	345	367
రెఫరల్స్	13	34
థైరాయిడ్ పరీక్షలు	25	15
థైరాయిడ్ గుర్తించినవి	1	0
రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్	190	214
రొమ్ము క్యాన్సర్ గుర్తించినవి	4	4
ఓరల్ క్యాన్సర్ పరీక్షలు	190	219
ఓరల్ క్యాన్సర్ గుర్తించినవి	2	1
గర్భాశయ ముఖద్వార పరీక్షలు	15	22
గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గుర్తించినవి	7	1
విటమిన్ డి పరీక్షలు	176	115



రోగ నిర్ధారణతో పరిష్కారం..
రోగ నిర్ధారణ పరీక్షల అనంతరం ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. రుతుక్రమ సమస్యలు, గర్భకోశ సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ, బ్రెస్ట్ క్యాన్సర్, రక్తహీనత, బరువు తగ్గడం, విటమిన్, ఐరన్ లోపం వంటి వ్యాధులను గుర్తించి చికిత్స చేస్తున్నారు.

నాలుగు వారాల్లో 712 మంది ఓపీ..
ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య సమస్యలకు మరింత మెరుగైన చికిత్స అందించేలా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపడుతోంది. జిల్లాలోని రెండు ఆరోగ్య కేంద్రాల్లో నాలుగు వారాల్లో 712 మంది మహిళలు జిల్లాలోని రెండు పీహెచ్‌సీలలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరికి పరీక్షల ఫలితాల ఆధారంగా చికిత్స కూడా అందిస్తున్నారు. తీవ్రమైన సమస్యలు ఉంటే జిల్లా జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంపై జిల్లాలో విస్తృత ప్రచారం కల్పిస్తే మరింతమంది వైద్య పరీక్షలు చేసుకునే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

మహిళలకు భరోసా..



నిత్యం ఇంటి పనుల్లో నిమగ్నమయ్యే మహిళల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆరోగ్య మహిళ కేంద్రాల్లో ప్రతీ మంగళవారం ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. సమస్యలు తెలుసుకుని ఉచితంగా మందులు, చికిత్స అందిస్తున్నాం. క్యాన్సర్‌లో పలు రకాలు ఉన్నప్పటికీ మహిళలు గుర్తించలేరు. మహిళలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తే ఉచితంగా రక్త పరీక్షలు చేసి వారిలోని రుగ్మతలను తెలియజేసి, వాటిపై అవగాహన కల్పిస్తాం. సరైన సమయంలో చికిత్స అందించడానికి ఆరోగ్య మహిళ కేంద్రం తోడ్పడుతుంది.
– డాక్టర్ ధనరాజ్, డీఎంహెచ్‌వో

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి..



మహిళలు కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో మహిళలందరూ పరీక్షలు చేయించుకుని ఆరోగ్యవంతంగా ఉండాలి. ప్రతీ మంగళవారం పీహెచ్‌సీలో ప్రత్యేకంగా మహిళలకు 8 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నాం. రిపోర్టు ఆధారంగా ఉచితంగా మందులు ఇస్తున్నాం. మెరుగైన వైద్యం అవసరమైన వారిని జిల్లా ఆసుపత్రికి పంపిస్తున్నాం. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలి.
– సౌమ్య, పీహెచ్‌సీ వైద్యురాలు

వైద్య పరీక్షల వివరాలు

1. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు
2. ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్
3. థైరాయిడ్ పరీక్ష, సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించడం, అయోడిన్ సమస్య, ఫోలిక్‌యాసిడ్, ఐరన్ లోపంతోపాటు, విటమిన్ బీ12, విటమిన్ డీ పరీక్షలు
4. మూత్రకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధుల పరీక్ష
5. మోనోపాజ్ దశకు సంబంధించిన పరీక్షలు, హార్మోన్ రీప్లేస్మెంట్ థెరపీ, కౌన్సెలింగ్
6. నెలసరి, సంతాన సమస్యలపై పరీక్షలు, అవగాహన, అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు
7. శారీరక కలయిక సంబంధిత అంటు వ్యాధుల పరీక్షలు, వైద్యం
8. బరువు నియంత్రణ, యోగా, వ్యాయామంపై అవగాహన

గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: రక్తహీనతతో గర్భిణుల్లో అనేక సమస్యలు వస్తున్నాయని, మరణాలకు దారితీస్తున్నాయని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా వైద్యశాఖ అధికారులతో వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. గర్భిణులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించి మాతా శిశు మరణాలు అరికట్టాలని సూచించారు. గర్భందాల్చిన మొదటి నెల నుంచే రిస్క్ కేసులను గుర్తించి సేవలు అందించాలని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ధనరాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు ఇద్రిస్‌గోరీ, రాజేందర్, కార్యక్రమం నిర్వహణ అధికారులు డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ సైనారెడ్డి, డాక్టర్ నిఖిల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేడు కడెంలో కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

కడెం: కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ మండల కేంద్రంలో మంగళవారం పర్యటిస్తారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్ తెలిపారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల కోసం గ్రామసభ నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని వెల్లడించారు.

రేపటి నుంచి సమ్మేటివ్ పరీక్షలు

నిర్మల్ రూరల్: ఈనెల 12వ తేదీ నుంచి 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6, 7, 8 తరగతుల వారికి ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:15 వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. 8వ తరగతి విద్యార్థులకు సైన్స్ పరీక్ష రోజున భౌతిక శాస్త్రం 9:30 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు, జీవశాస్త్రం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులకు సైన్స్ పరీక్ష రోజున ఉదయమే రెండు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహించిన అనంతరం విషయ ఉపాధ్యాయులు జవాబు పత్రాల మూల్యాంకన చేసి ఫలితాలను కుమ్యులేటివ్ రికార్డ్సను ఈ నెల 21 లోపు పూర్తి చేయాలని తెలిపారు. 24న తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వాలని సూచించారు. 25 నుంచి వేసవి సెలవులు ఉంటాయని పేర్కొన్నారు.

ఆర్టీసీలో ఇష్టారాజ్యం..!



భైంసా ఆర్టీసీ బస్టాండ్

- ఉమర్‌ఖేడ్‌కు ఐదు రోజులు బస్సు సర్వీస్ నిలిపివేత
- అద్దె కారుకు చలానా వేసినందుకేనని సందేహాలు
- వివాదాస్పదమవుతున్న డీఎం తీరు

భైంసాటౌన్: భైంసా ఆర్టీసీలో అధికారుల ఇష్టారాజ్యం నడుస్తోందని విమర్శలు వస్తున్నాయి. డిపో మేనేజర్ ఇటీవల ఏకంగా ఒక రూటుకు ఐదురోజుల పాటు బస్ సర్వీస్ నిలిపేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డిపోలోని ఉద్యోగులే డీఎం తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతనెలలో డిపో మేనేజర్ అద్దె కారులో మహారాష్ట్రలోని ఉమర్‌ఖేడ్ వైపు రూట్ సర్వే కోసం వెళ్లారని తెలిసింది. అయితే సదరు కారుకు మహారాష్ట్రకు వెళ్లేందుకు అనుమతి లేకపోవడంతో అక్కడి ఆర్టీవో అధికారులు రూ.11 వేల చలానా విధించారు. ఈ విషయంలో ఆగ్రహించిన డీఎం మహారాష్ట్రలోని ఉమర్‌ఖేడ్‌కు వెళ్లే బస్సు సర్వీసులను ఐదురోజులు నిలిపివేయడం చర్చనీయాంశమైంది. సదరు రూట్‌లో బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. సంస్థ ఆదాయం కోల్పోయింది. ఈ విషయం ఆర్‌ఎం వరకు వెళ్లడంతో ఐదురోజుల తరువాత సర్వీసులు పునరుద్ధరించినట్లు తెలిసింది. ఈ విషయమై డీఎం అమృతను వివరణ కోరగా, మహారాష్ట్రకు వెళ్లిన సందర్భంలో అద్దె కారుకు చలానా వేసిన మాట వాస్తవేమనన్నారు. అయితే, ఉమర్‌ఖేడ్‌కు బస్సు సర్వీసులు నిలిపేయలేదని పేర్కొన్నారు. కౌన్సెలింగ్ లేకుండా డ్యూటీ చార్ట్ అమలు చేయడంపై ఆర్‌ఎం జానీరెడ్డిని వివరణ కోరగా, ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, అభ్యంతరాలు పరిశీలించి మరోమారు డ్యూటీ చార్ట్ తయారు చేయాలని సూచించినట్లు తెలిపారు. డీఎం అద్దె కారుకు మహారాష్ట్రలో చలానా విధించిన విషయం తెలిసిందని, ఉమర్‌ఖేడ్‌కు బస్సు సర్వీసులు రెండు మూడు రోజులు నడపలేదన్న విషయం కూడా తన దృష్టికి వచ్చిందన్నారు.

ఆందోళనలో ఉద్యోగులు...!
భైంసా ఆర్టీసీ డీఎం వైఖరితో తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని పేరు చెప్పేందుకు ఇష్టపడని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. చిన్నచిన్న తప్పిదాలకే పనిష్మెంట్లు ఇస్తున్నారని, ఎలాంటి సమాచారం లేకుండా డ్యూటీచార్ట్ అమలు చేయడం, ఇష్టానుసారంగా వీక్లీ ఆఫ్ వేయడం, 55 ఏళ్లు నిండిన డ్రైవర్లకు ఆర్డినరీ డ్యూటీలు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం సీనియర్లకు ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్ డ్యూటీలు, జూనియర్లకు ఆర్డినరీ సర్వీసులు అప్పగిస్తూ డ్యూటీ చార్ట్ అమలు చేయాలి. అంతేగాక, డ్యూటీ చార్ట్ అమలు చేసే ముందు కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. కానీ డీఎం తమకు ఎలాంటి కౌన్సెలింగ్ లేకుండా ఈనెల నుంచి కొత్త డ్యూటీ చార్ట్ వేశారని చెబుతున్నారు. సీనియర్లకు ఆర్డినరీ బస్ డ్యూటీలు వేయడంతో పలువురు ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు పేర్కొంటున్నారు. రెండేళ్ల క్రితం ఓ కండక్టర్ బస్సులో కార్గో పార్శిళ్లు తెచ్చేందుకు నిరాకరించాడనే కారణంతో ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేసి వేధించినట్లు సదరు కండక్టర్ తెలిపాడు. అనారోగ్యంతో ఉన్నా సిక్ లీవు ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాము నిర్భయంగా విధులు నిర్వహించే వాతావరణం కల్పించాలని కోరుతున్నారు.

భూ సమస్యలు.. ఇళ్ల స్థలాలు.. పింఛన్లు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి



ప్రజావాణికి వచ్చిన బాధితులు

- ప్రజావాణికి వచ్చిన అర్జీల్లో ఇవే ఎక్కువ
- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వ్యవసాయ భూముల సమస్యలు పరిష్కరించాలని, పట్టాలు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు కావాలని, పింఛన్లు మంజూరు చేయాలనే ఎక్కువ మంది అర్జీలు పెట్టుకున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 31 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ వరుణ్ రెడ్డి స్వయంగా అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటి ని సంబంధిత అధికారులకు పంపించారు. త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

నకిలీ పట్టాలు..
న్యూవెల్మల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఖాళీ గా ఉన్న స్థలాన్ని నకిలీ పట్టాలు సృష్టించి కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ నాయకుడు అంకం శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ భవిష్యత్ అవసరాల కోసం వదిలిన భూమిని గ్రామ కంఠంకు అప్పగించాలన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో వెల్మల్ గ్రామం ముంపునకు గురికావడంతో ముక్తాపూర్ శివారులో అధికారులు ఇళ్ల స్థలాలు కేటాయించారని తెలిపారు. వాటిలో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. లేఅవుట్ సమయంలో గ్రామ భవిష్యత్ అవసరాల కోసం, పశువుల మేత, పశువుల దొడ్డి, శ్మశానవాటిక ఇతర అవసరాల కోసం కొంత భూమిని వదిలేశారని వివరించారు. గ్రామానికి చెందిన కొంత మంది ఈ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారని తెలిపారు. నకిలీ పట్టాలు సృష్టించిన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని ప్రభాకర్, సాయన్న, గడ్డం స్వామి, సాగర్, నాగయ్య కోరారు.

పరిహారం అందించాలి
లోకేశ్వరం నుంచి నందిపేట్ వరకు నిర్మిస్తున్న రోడ్డుతో పంచగుడి గ్రామంలో ఇళ్లు కోల్పోయే వారికి పరిహారం అందించాలని గ్రామస్తులు కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. పరిహారం పొందిన వ్యక్తి భూమిలో రోడ్డు పనులు చేయకుండా పరిహారం ఇవ్వని వారి స్థలాల్లో పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈమేరకు మార్కింగ్ చేస్తున్నారని తెలిపా రు. ఆర్‌అండ్‌బీ అధికారులతో మరోమారు సర్వే చేయించాలని కోరారు.

నిర్వాసితులకు త్వరలో పరిహారం



మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ డీఈ కొండయ్య

లోకేశ్వరం: లోకేశ్వరం–నందిపేట్ రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు కోల్పోయే నిర్వాసితులకు త్వరలో పరిహారం అందిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ కొండయ్య తెలిపారు. నిర్వాసితులు ప్రజావాణిలో సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈడీ స్పందించారు. పంచగుడి పోచమ్మ ఆలయంలో నిర్వాసితులతో సమావేశమయ్యారు. గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం పంచగుడి–ధర్మోర సరిహద్దు ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తామన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మూల మలుపు లేకుండా చేస్తామని తెలిపారు. పంచగుడి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు త్వరలో 60 శాతం పరిహారం ఇస్తామని పేర్కొన్నారు. పరిహారం అందించిన వెంటనే ఇళ్లు తొలగించే పనులు చేపడతామని చెప్పారు. ప్రస్తుతం ఇళ్లకు సంబంధించి రూ.1.70 కోట్లు రెవెన్యూ ఖాతాలో జమయ్యాయని తెలిపారు. సమావేశంలో ఏఈ రఘు, సర్పంచ్ ఎలన్న, ఉప సర్పంచ్ ఇంద్రకరణ్‌గౌడ్, వీడీసీ చైర్మన్ గంజాల గంగాధర్, దుబాయి శ్రీనివాస్, భోజప్ప పటేల్, రాజారెడ్డి, నిర్వాసితులు భాస్కర్‌రెడ్డి, సాగర్‌గౌడ్, నర్సయ్య, మాణిక్‌రావు, మారుతి పాల్గొన్నారు.

ఉపాధి పనులకు వచ్చేలా చూడాలి



లోకేశ్వరం: ఉపాధి పనులకు కూలీలు వచ్చేలా చూడాలని ఏపీడీ ఓసా ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఏపీ డీ పలు రికార్డులు పరిశీలించి మాట్లాడారు. పని ప్ర దేశంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏపీవో జగన్నాథ్, టీఏలు శారద, హరిత, రవీందర్ ఉన్నారు.

తరలిపోతున్న చెరువు మట్టి



పల్సి చెరువులో మట్టి తోడుతున్న ప్రొక్లెయిన్

కుభీర్: మండలంలోని పల్సి, రంజని, సిర్పెల్లి తదితర చెరువుల్లోని మట్టి అక్రమంగా తరలిపోతోంది. కొందరు ప్రొక్లెయిన్లు పెట్టి ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి తరలించుకుపోతున్నారు. మట్టి తరలించేందుకు మైనింగ్ (భూగర్భ జలవనరుల శాఖ)అనుమతి లేదా తహసీల్దార్ అనుమతి తీసుకోవాలి. ఇందుకు ప్రభుత్వానికి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే మండలంలో కొంతమంది అక్రమార్కులు ఎలాంటి అనుమతి తీసుకోకుండానే చెరువుల్లోకి యంత్రాలను దించి మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో భూగర్భజలం అడుగంటుతోంది. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ విశ్వంబర్‌ని వివరణ కోరగా, ఆర్ఐ సెలవులో ఉన్నారని, మంగళవారం తనిఖీ చేసి బాధ్యులపై చర్య తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

దివ్యాంగులను మోసగించిన వ్యక్తిపై కేసు

లోకేశ్వరం: దివ్యాంగులను మోసగించిన నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన కథలాపూర్ ప్రవీణ్‌పై సోమవారం లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. లోకేశ్వరం మండలంలోని ధర్మోర, పంచగుడి, వట్టోలి, పిప్రి, మొహళ, బిలోలి, హవర్గ, మన్మద్ గ్రామాల్లో దివ్యాంగులకు రుణాలు, డబుల్ బెడ్రూం, పెన్షన్, సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు ఇప్పిస్తానని ప్రవీణ్ మాయమాటలు చెప్పాడు. అతని మాటలు నమ్మి పలువురు రూ.3 లక్షల డబ్బులు చెల్లించారు. ప్రవీణ్ నాలుగేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. ధర్మోర గ్రామానికి చెందిన తెనుగొండ ఎంకవ్వ ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెక్‌పోస్ట్ ధ్వంసం కేసులో ఇద్దరు యువకులకు జైలు

కడెం: మండలంలోని పాండ్వపూర్‌లో అటవీశాఖ చెక్‌పోస్టును ధ్వంసం చేసిన కేసులో ఇద్దరు యువకులకు 14 రోజుల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం నిర్మల్ ఫస్ట్‌క్లాసు మెజిస్ట్రేట్ అజయ్ తీర్పు వెలువరించారు. పాండ్వపూర్‌కు చెందిన సుద్దాల రాజేష్, కోటే మహేశ్‌ను గత ఫిబ్రవరి 8న చెక్‌పోస్ట్‌పై దాడి చేసి, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారు. నిర్మల్ కోర్టులో వారిని ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో 14 జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారని ఎస్సై కొసన రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో సోమవారం పేకాట స్థావరంపై స్పెషల్ టీం దాడి చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి 9 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ. 5630 నగదుతోపాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకున్నామని పేర్కొన్నారు.

ఇంట్లో చోరీ


ముథోల్: మండలంలోని తరోడ గ్రామంలో ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సిలరే గంగాధర్, భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తైతో కలిసి ఈనెల 4న తిరుపతికి పయనమయ్యారు. ఇంటికి తాళం వేశారు. ఎప్పటిలాగే తాళం చెవి వారికి తెలిసిన చోట పెట్టారు. ఆదివారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చి చూస్తే బీరువాలో 3 తులాల బంగారం, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకు లంపీస్కిన్


లేగదూడకు సోకిన లంపిస్కిన్

కుభీర్: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో పశువులకు లంపీస్కిన్ వ్యాధి సోకింది. కుభీర్‌లోని విఠలేశ్వర మందిరానికి చెందిన ఆవులు ఐదారు ఉన్నాయి. అందులో ఒక లేగదూడకు ఈ వ్యాధి సోకింది. ఈ విషయమై పశువైద్యుడు విశ్వజిత్ మాట్లాడుతూ వ్యాధి సోకిన పశువును మిగతావాటికి దూరంగా ఉంచాలని అన్నారు. ఆసుపత్రికి తీసుకువస్తే వ్యాక్సిన్ వేస్తామన్నారు.

కుప్టి..ప్రాణాలు హరీ


ప్రమాదాలు జరుగుతున్న కుప్టి బ్రిడ్జి ఇదే..

- కుప్టి బ్రిడ్జి వద్ద తరచూ ప్రమాదాలు
- మలుపుల వద్ద అదుపుతప్పుతున్న వాహనాలు
- ప్రతిఏటా 50 మందికి పైగా మృత్యువాత
- బ్లాక్‌స్పాట్‌గా గుర్తించినా చర్యలు శూన్యం

ఇచ్చోడ: నేరడిగొండ-ఇచ్చోడ మండలాల మధ్య కుప్టి బ్రిడ్జి వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు ఏటవాలుగా ఉండటంతోపాటు బ్రిడ్జి సమీపంలో మూలమలుపు ఉండటంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. లారీ డ్రైవర్లు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ప్రతిఏటా 50కి పైగా మంది మృత్యువాత పడుతున్నారు. చాలా మంది వికలాంగులుగా మారుతున్నారు. ప్రమాదాల్లో అనేక కుటుంబాల్లో తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నాయి. అధికంగా ద్విచక్రవాహనదారులే మృత్యువాత పడుతున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గతంలో కుప్టి బ్రిడ్జి బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. కానీ తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఏడు నెలల్లో 13 మంది..

గతేడాది అక్టోబర్ నుంచి ఈనెల ఏప్రిల్ 4 వరకు 44వ జాతీయ రహదారి కుప్టి బ్రిడ్జిపై 30కి పైగా రోడ్డు ప్రమాదాల్లో 13 మంది మృత్యువాత పడగా, మరో 10 మంది వరకు గాయాల పాలయ్యారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఈ రహదారి విస్తరించి ఉంది. జిల్లా పరిధిలో ఈ రోడ్డు 110 కి.మీ ఉండగా, బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ సర్కిల్ పరిధిలో దాదాపు 80 కి.మీ పొడవులో ఉంటుంది.

నేషనల్ హైవే అథారిటీ తప్పిదం..

నేషనల్ హైవే అథారిటీ తప్పిదమే కుప్టి బ్రిడ్జి వద్ద మృత్యురూపంలో వెంటాడుతోంది. తరచూ ప్రమాదాల్లో ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తున్న వారు తమ గమ్యస్థానాలకు చేరుకోకుండానే నిమిషాల వ్యవధిలో ప్రాణలు గాలిలో కలిసిపోతున్నాయి. రెండు భారీ కొండల మధ్యన కడెం వాగుపై కుప్టి బ్రిడ్జి ఉంది. నాలుగు వరుసల 44వ జాతీయ రహదారి పనుల్లో భాగంగా గతంలో ఉన్న ఘాట్ రోడ్డును మూసివేశారు. నూతనంగా రెండు కొండల మధ్య నుంచి ఘాట్ కటింగ్ చేసి రోడ్డును నిర్మించారు. ఇరువైపులా దాదాపు 3 కి.మీ పొడవునా రహదారి కిందికి ఏటవాలుగా ఉంది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న బ్రిడ్జి దగ్గరలో మూలమలుపు ఉంది. రహదారి కిందికి డౌనల్ ఉండటంతో వాహనాల డ్రైవర్లు గేర్ న్యూట్రల్ చేయడంతో కనీసం 100 కి.మీ వేగంతో వాహనాలు వెళ్తాయి. బ్రిడ్జి వద్ద ఉన్న మలుపు ప్రాంతంలోకి రాగానే అవి అదుపు తప్పుతున్నాయి. దీంతో పక్కనుంచి ప్రయాణిస్తున్న వాహనాలను ఢీ కొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.


కుప్టి బ్రిడ్జిపై నుంచి వాగులో పడిపోయిన టిప్పర్ (ఫైల్)

ప్రమాదాలు ఇలా..

- ఈనెల 4న బైక్‌ను కుప్టి బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.
- గతేడాది నవంబర్‌లో కుప్టి బ్రిడ్జిపై నుంచి టిప్పర్ వాగులో పడ్డ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు.
- గతేడాది అక్టోబర్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృత్యవాతపడ్డారు. మే నెలలో జరిగిన ప్రమాదాల్లో వివిధ సంఘటనలో ఐదుగురు మృతి చెందారు.

నివేదించాం



జిల్లా ఎస్పీ ఆదేశాలతో కుప్టి బ్రిడ్జి వద్ద జరుగుతున్న ప్రమాదాలపై నివేదికను తయారు చేసి నేషనల్ హైవే అథారిటీ వారికి అందజేశాం. తరచూ ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతున్నారు. ప్రమాదాల నివారణకు తమవంతు చర్యలు తీసుకుంటాం.

– ముదావత్ నైలు, ఇచ్చోడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్

కదంతొక్కిన బీడీ కార్మికులు


కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న బీడీ కార్మికులు

- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, ధర్నా
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు

కైలాస్‌నగర్: అర్హులైన తమకు పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీడీ కార్మికులు సోమవారం కదంతొక్కారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి పట్టణంలోని తానీషా గార్డెన్‌లో సమావేశమయ్యారు. అక్కడి నుంచి బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినీరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ మెయిన్‌గేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపిన బీడీ కార్మికులు, పోలీసులను తోసుకుని కార్యాలయం లోనికి చొచ్చుకెళ్లారు. అక్కడ బైఠాయించి కలెక్టర్ రావాలంటూ నినదించారు. ట్రెయినీ కలెక్టర్ డా.పి.శ్రీజ వారి వద్దకు రాగా తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా సుహాసినీరెడ్డి మాట్లాడుతూ 2018 ఎన్నికల్లో బీడీ కార్మికులకు సీఎం కేసీఆర్ హామీఇచ్చి విస్మరించారని ఆరోపించారు. పీఎఫ్ ఉన్న ప్రతి బీడీ కార్మికునితో పాటు ఏజెంట్లకు కూడా పింఛన్ అమలు చేస్తామని చేయలేదన్నారు. వెయ్యి బీడీలు చూడితే రూ.200 వస్తాయన్నారు. వాటి కోసం కార్మికులు ఇంటి పనులు వదుకోవాల్సి వస్తుందని, అద్దె ఇళ్లలో ఉండి కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి జీవో 38 ప్రకారం అర్హులైన కార్మికులందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు జీవీ రమణ, కాంత, బీడీ కార్మికులు గంగమణి, కిరణ్, రజిత, లక్ష్మి, రజియా తదితరులున్నారు.


బైఠాయించిన బీడీ కార్మికులు

భైంసాలో నకిలీ నోట్ల కలకలం..!


నకిలీదిగా అనుమానిస్తున్న నోట్(పైనది)


నోటును పరిశీలిస్తున్న ఎస్సై తిరుపతి

భైంసాటౌన్: పట్టణంలో సోమవారం కూరగాయల వారసంతలో నకిలీ నోట్ల కలకలం రేపింది. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో దాదాపు పన్నెండేళ్ల ఓ బాలుడు భోకర్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్ అనే వ్యాపారి వద్ద రూ.500 నోటు ఇచ్చి రూ.20 కూరగాయలు కొనుగోలు చేసి రూ.480 తీసుకెళ్లాడు. తిరిగి కొద్దిసేపటికి మరో రూ.500 నోటుతో వచ్చి కూరగాయలు తీసుకుంటుండడంతో నోటు నకిలీదని అనుమానం వచ్చిన ప్రవీణ్ సదరు బాలుడిని పట్టుకునేందుకు యత్నించగా పారిపోయాడు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై తిరుపతి అక్కడికి చేరుకుని నోట్లు పరిశీలించారు. బాలుడి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించే చర్యలు చేపడుతామన్నారు.

కలెక్టరేట్ ఎదుట రిటైర్డు ఉద్యోగుల నిరసన దీక్ష

కైలాస్‌నగర్: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లక్ష్మారెడ్డి, పి.కిష్టయ్య డిమాండ్ చేశారు. సోమవారం రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. తొలుత తెలంగాణ చౌక్‌లోని తమ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి దీక్షలో కూర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగులకు ప్రతి నెల 1న పెన్షన్‌ను వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఆదాయ పన్ను నుంచి మినహాయింపునివ్వాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీంను ప్రైవేట్ ఆసుపత్రుల్లో అమలు చేసేలా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. నగదు రహిత ఆరోగ్య సేవలందించాలని డిమాండ్ చేశారు. మూడు డీఏలను విడుదల చేయడంతోపాటు కొత్త పీఆర్సీని అమలు చేయాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజకు అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ పాండే, సంఘం నాయకులు ఎం.రాజేశ్వర్‌రెడ్డి, సుధాకర్, నరేందర్, సుధీర్, రాంకులకర్ణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

కలప వ్యాన్ స్వాధీనం

గుడిహత్నూర్: అక్రమంగా తరలిస్తున్న టేకు కలప వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో పక్కా సమాచారంతో సీఐ నైలూనాయక్, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌లు రెండు బృందాలుగా ఏర్పడి సోమవారం తెల్లవారుజాము మండల కేంద్రంలోని హిందుస్తాన్ దాబా సమీపంలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా నిలిపి ఉన్న వ్యాన్‌ను తనిఖీ చేస్తుండగా ఇద్దరు పరారయ్యారు. దీంతో వ్యానులో 48 టేకు దుంగలు ఉన్నాయి. వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఆర్వో పాండురంగ్, సెక్షన్ ఆఫీసర్ కృష్ణ నాయక్, ఎఫ్‌బీవో నర్సయ్యలు వ్యాన్‌ను ఇచ్చోడ కలప డిపోకు తరలించారు. కలప విలువ రూ.5 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. తనిఖీల్లో ఏఎస్సై బలిరాం, కానిస్టేబుళ్లు విట్టల్, భూమన్న, సదాశివ్ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న కలప వాహనంతో పోలీసు, అటవీ అధికారులు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భైంసా: బాసర గోదావరి నది రైల్వేవంతెన వద్ద ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్‌ఖాన్ సోమవారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయసు 40 ఏళ్లు ఉండవచ్చని, సంబంధీకులు బాసర రైల్వేపోలీసులను సంప్రదించాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు



ఖానాపూర్: పట్టణంలో నత్తనడకన సాగుతున్న రోడ్డు వైడింగ్ పనులు ప్రజల ప్రాణాలకు ప్రాణసంకటంగా మారాయి. ఇరుకురోడ్డు కారణంగా గత మూడు రోజుల క్రితం బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందాడు. ఈ ఘటన మరువకముందే సోమవారం ఓ కారు డివైడర్‌ను ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న పలువురికి గాయాలు కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న దగ్ధం

నర్సాపూర్(జి): నర్సాపూర్ (జి) శివారులో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైంది. మండల కేంద్రానికి చెందిన పుష్ప మైస్కర్ అనే మహిళా రైతుకు చెందిన మూడెకరాల 37 గుంటలో మొక్క జొన్న సాగు చేసింది. ఇటీవల కోత కోసి కుప్పపోసింది. షార్ట్ సర్క్యూట్‌తో చేతికొచ్చిన పంట పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.లక్షా 50 వేలు నష్టం వాటిల్లిందని బాధిత మహిళ రైతు తెలిపింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంది.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్


అర్జీలు స్వీకరిస్తున్న గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్

ఉట్నూర్: గిరిజనుల అర్జీలు త్వరగా పరిష్కరించాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వారి అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున గిరిజన గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పీవీటీజీ అధికారి భాస్కర్, జేడీఎం నాగభూషణం, ఏవో రాంబాబు, పీఈటీసీ ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా రుణం మంజూరు చేయాలని నార్నూర్ మండలం మహాగావ్‌కు చెందిన రాథోడ్ భరత్, ఉట్నూర్ మండలం హస్నాపూర్‌కు చెందిన శ్రీధర్ కుమార్ అర్జీలు సమర్పించారు.
- ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూమికి అటవీ హక్కు పత్రం అందించాలని బజార్‌హత్నూర్ మండలం లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన అడె శ్రీరాం వేడుకున్నాడు.
- గిరి వికాసం ద్వారా తన పంట పొలం వద్ద బోరు బావి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఇంద్రవెల్లి మండలం ధన్నోర(బి)కి చెందిన కుర్సెంగ ప్రభాకర్ అర్జీ పెట్టుకున్నాడు.

ఇచ్చోడలో ప్రవేశపరీక్ష పరిశీలన


పరిశీలిస్తున్న ఏటీడీవో సౌజన్య

ఇచ్చోడ: వచ్చే విద్యాసంవత్సరంలో గిరిజన విద్యార్థుల కోసం జిల్లాలో రెండు సైన్స్ ఒలింపియాడ్ మోడల్ స్కూళ్లు ప్రారంభించనున్నట్లు ఏటీడీవో సౌజన్య తెలిపారు. ఇచ్చోడలో ఆశ్రమ పాఠశాల్లో ఒలింపియడ్ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు సోమవారం పరీక్ష నిర్వహించారు. ఆమె పరిశీలించి మాట్లాడారు. సైన్స్ ఒలింపియాడ్ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు 5 నుంచి 7 వతరగతి వరకు, ప్రతి తరగతి నుంచి 40 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఆమె వెంట జీసీడీవో మెస్రం ఛాయ ఉన్నారు.

పిచ్చికుక్కదాడిలో బాలుడికి గాయాలు


గాయాలైన శ్రీకర్

లక్ష్మణచాంద: సోన్ మండలంలోని న్యూవెల్మల్‌లో సోమవారం పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలయ్యాయి. అగ్గు శ్రీకర్(10) ఇంటి వద్ద ఆడుకుంటుండగా అటువైపు వచ్చిన పిచ్చి కుక్క దాడి చేసింది. శ్రీకర్‌ను తండ్రి దిలీప్ స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లగా వైద్యురాలు సమత ప్రాథమిక చికిత్స చేశారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేపడుతాం

- టీఎస్‌పీఈ జేఏసీ చైర్మన్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 17 నుంచి సమ్మె చేపడుతామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గతేడాది పీఆర్సీలో 35 శాతం ఇచ్చారని, ఈసారి ప్రభుత్వం 7 శాతం లోపే పీఆర్సీ ఇస్తామని పేర్కొనడం సరికాదన్నారు. ఈపీఎఫ్ టు జీపీఎఫ్ నిధులు 1999 సంవత్సరం వరకే ఇచ్చారని, 2004 వరకు వాటిని చెల్లించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 వేల మంది కార్మికులను రెగ్యులరైజ్ చేశామని ప్రభుత్వం ప్రకటించినా వారికి రెగ్యులర్ ఉద్యోగులతో సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ సమ్మెలో 23 సంఘాలతో కలిసి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం బాధ్యులు శ్రీధర్, రత్నాకర్, సదానందం, శ్రీనివాస్, రమేశ్, జనార్దన్‌రెడ్డి, గౌతమ్, ఉమ్మడి జిల్లాకు చెందిన కార్మికులు, ఆర్టిజన్లు, అన్‌మ్యాన్ వర్కర్లు, స్పాట్ బిల్లర్లు, కలెక్షన్ ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ కేటాయింపు చరిత్రాత్మకం

- ఓసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: అగ్రవర్ణాల పేదలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్ అమలు చేయడం చరిత్రాత్మకమని ఓసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓస్ సంఘ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 103వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశంలోని అగ్రవర్ణాల పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించడంతో ఓసీలకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. ఇతర సామాజిక వర్గాలకు ఇబ్బందులు కలగకుండా కేంద్రం ఇచ్చిన రిజర్వేషన్లను వ్యతిరేకించడం సరికాదన్నారు. అగ్రవర్ణాల పేదలు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి లక్ష కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జనగం సంతోష్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.